సాక్షి
అనంతపురం
శనివారం । 3 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.17,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,500 పలికాయి.



జిల్లాకు వర్ష సూచన

జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంట ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
33.5°/23.8°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ



ఏటీఎంను పగులగొట్టి నగదు చోరీ చేసిన దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో శుక్రవారం తెల్లవారుజామున భారతీయ స్టేట్ బ్యాంకు(ఎస్‌బీఐ) డిపాజిట్ ఏటీఎంలో చోరీ జరిగింది. దుండగులు ఏటీఎం మిషన్‌ను గ్యాస్ కట్టర్‌తో పగలకొట్టి అందులోని రూ. 3,28,600 నగదు ఎత్తుకెళ్లారు. చోరీ విషయం సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్‌లోని ఎస్‌బీఐ హెడ్డాఫీస్ వారికి తెలియడంతో వెంటనే కల్లూరు బ్యాంకు మేనేజర్ రామాంజి బాబుకు, పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులతోపాటు బ్యాంకు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించారు. కల్లూరు సంజీవరెడ్డి సర్కిల్ వైపు నుంచి రాత్రి 2.42 గంటల సమయంలో కారులో వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఏటీఎంలోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు, అనంతరం రాత్రి 3 గంటలకు వెళ్లిపోయినట్లు సీసీ పుటేజీలో రికార్డు అయ్యింది. ముగ్గురు కూడా ముఖం కనపడకుండా ముసుగు ధరించినట్లు పోలీసులు తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంలను రంగంలోకి దింపి.. వేలిముద్రలు సేకరించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు.

ఫిడే రేటింగ్‌లో 'అనంత' క్రీడాకారులకు చోటు



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన ఫిడే రేటింగ్‌లో అనంతపురం జిల్లా క్రీడాకారులకు చోటు దక్కింది. ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్ విభాగంలో అనన్య గండికోట 1634 రేటింగ్, ఆదిత్యరెడ్డి 1474 రేటింగ్, జమ్మీరుల్ మిస్బా 1451 రేటింగ్, మొయిన్ అహ్మద్ 1434 రేటింగ్, ఇంటర్నేషనల్ ఫిడే బ్లిట్జ్ రేటింగ్ విభాగంలో జొన్నలగడ్డ నితీష్ చౌదరి 1425 రేటింగ్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే గుంతకల్లుకు చెందిన అనిల్‌కుమార్ 41 సంవత్సరాల వయస్సులో ఇంటర్నేషనల్ ఫిడే క్లాసికల్ రేటింగ్ విభాగంలో 1553 రేటింగ్‌ను సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అనంతపురంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

నేటి నుంచి జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం: నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో శనివారం ప్రారంభం కానున్నాయి. జూనియర్ గర్ల్స్ టైర్–1 పోటీలతో టోర్నీ ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జార్ఖండ్- ఏపీ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుందని పేర్కొన్నారు. టీం –బీలో బిహార్- హిమాచల్ ప్రదేశ్ జట్లు పోటీపడతాయని తెలిపారు.

వామ్మో.. పాము!

పాములు మనుషులను బెంబేలెత్తిస్తున్నాయి. పాముకాటు బాధితుల సంఖ్య ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా పెరుగుతోంది. ఎక్కువగా వర్షాకాలంలో పాముకాట్లు నమోదవుతున్నాయి. ఏటా సగటున 2,600 మంది పాముకాటుకు గురవుతున్నారు. రాష్ట్రంలోనే పాముకాటు బాధితుల్లో 'అనంత' నాలుగో స్థానంలో ఉంది. వ్యవసాయాధారిత జిల్లా కావడంతో ఎక్కువగా పొలం పనులకు వెళ్లే వారే పాము కాటుకు గురవుతున్నట్టు తాజా గణాంకాల్లో బయటపడింది.

- ఉమ్మడి జిల్లాపై పాముల పగ
- పాముకాట్లలో 'అనంత'కు నాలుగో స్థానం
- ఏటా సగటున 2,600 కేసుల నమోదు
- బాధితుల్లో యువకులు, మధ్య వయస్కులే అధికం
- 23 శాతం మంది విషపూరిత పాముల కాటుకు గురి



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అత్యంత విషపూరితమైన పాములుగా నాలుగు రకాల పాములను గుర్తించారు. వీటిలో నాగుపాము, కట్ల పాము, రక్త పింజరి, చిన్న పింజరి లేదా తోటి పింజరి పాములు ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నమోదవుతున్న పాముకాటు కేసుల్లో 23 శాతం ఈ నాలుగు రకాల పాములకు సంబంధించినవేనని తేలింది. ఈ పాములు కాటేసిన 30 నిమిషాల్లో ప్రథమ చికిత్స చేయకపోతే ప్రాణాపాయం ఉంటుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ నాలుగు రకాల పాములు స్వతహాగా కాటువేయడానికి ఆసక్తి చూపించవు. కానీ వాటిని తాకడం, తొక్కడం వంటివి చేసినప్పుడు బలంగా కాటు వేసే అవకాశం ఉందంటున్నారు. కొన్ని నీటిపాములు, జెర్రిగొడ్లు వంటివి ప్రాణాపాయం కాదని, ప్రథమ చికిత్స చేస్తే వెంటనే కోలుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

బాధితుల్లో యువకులే ఎక్కువ

పాముకాటుకు గురవుతున్న బాధితుల్లో ఎక్కువగా యువకులు, మధ్య వయస్కుల వారే ఉండటం గమనార్హం. పొలం పనులకు వెళ్లేవారిలో వీళ్లే ఎక్కువ. 21–30 ఏళ్ల వయస్కుల్లో 24 శాతం మంది బాధితులుండగా, 31–40 ఏళ్ల మధ్య వయసు వారు 24 శాతం మంది ఉన్నారు. 41–50 ఏళ్ల వారు 19 శాతం మంది పాముకాటు బాధితులు ఉన్నారు. పదేళ్లలోపు చిన్నారుల్లో 10 శాతం మంది ఉన్నారు. ఇదిలా ఉండగా పురుషులే ఎక్కువ మంది పాముకాటుకు గురవుతున్నారు. బాధితుల్లో 63 శాతం మంది పురుషులు, 37 శాతం మంది మహిళలు ఉన్నారు.

రాత్రిపూటే పాముకాట్లు

పొలం పనులకు వెళ్లే రైతులు లేదా కూలీలు రాత్రి పూట అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న పాము కాట్లు 35 శాతానికి పైగా సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య జరుగుతున్నట్టు వెల్లడైంది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల లోపు 32 శాతం మేర కేసులు నమోదయ్యాయి. మిగతా కేసులన్నీ పగలు పూట నమోదైనవిగా గుర్తించారు. పాము కాటుకు గురైన బాధితులు 92 శాతం మంది 108 సర్వీసులోనే ఆస్పత్రులకు చేరారు. మొత్తం బాధితుల్లో 8 శాతం మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లగా, మిగతా 92 శాతం మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఇదిలా ఉండగా గడిచిన రెండు మాసాల్లో పాముకాటుతో ముగ్గురు మృతిచెందారు.

నాటువైద్యం జోలికి వెళ్లొద్దు



పాము కాటు వేసిందని తెలియగానే నాటువైద్యం జోలికి వెళ్లొద్దు. ఇది మంచి పద్ధతికాదు. ఏ పాము కరిచినా సరే పసరు తాగిద్దామనే అలవాటు మానుకోవాలి. సకాలంలో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలి. వైద్యులు ఇచ్చే సూది మందుతో విషం అదుపులోకి వస్తుంది. ప్రాణాలకు భరోసా దక్కుతుంది. పాముల్లోనూ 50 శాతం విషం లేనివి ఉంటాయి. తాచు, నాగు, కట్లపాము, పింజరి లాంటి విష సర్పాలతోనే ఇబ్బంది. జాగ్రత్త పాటించాలి.

– రమేష్, వైద్యాధికారి, గుమ్మఘట్ట

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో పాముకాట్లు ఇలా..

సంవత్సరం	నమోదైన కేసులు
2021	2,571
2022	2,612
2023	2,644
2024 జూన్ వరకు	1,629

వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి



వర్షాకాలంలో ఎక్కువగా పాముకాటు కేసులు నమోదవుతుంటాయి. పొలాలకు వెళ్లే రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువగా ఈ ప్రాంతంలో నాగుపాము, కట్లపాము, పింజర్లు, జెర్రిపోతు వంటి పాములు ఉన్నాయి. పాముకాటుకు గురై చాలా మంది సరైన సమయంలో ఆస్పత్రికి రాక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి ప్రతి నెలా 8 నుంచి 12 వరకు పాము కాటు కేసులు వస్తున్నాయి. సరైన సమయంలో వస్తే వైద్యం అందించి ప్రాణాలు కాపాడవచ్చు.

– డాక్టర్ శివ, సివిల్ అసిస్టెంట్ సర్జన్, సీహెచ్‌సీ, కళ్యాణదుర్గం

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు



కౌంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు అందించే కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం అనంతపురం రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దేశవాళీ రకం కిలో కంది పప్పు రూ.181, స్టీమ్డ్ బీపీటీ సోనా బియ్యం కిలో రూ.55.85, పచ్చి బీపీటీ సోనా బియ్యం కిలో రూ.52.40 ప్రకారం నడుస్తోందన్నారు. ఈ క్రమంలో వినియోగదారులకు తక్కువ ధరలకే అందించాలనే ఆలోచనతో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో కిలో కంది పప్పు రూ.160, స్టీమ్డ్ బియ్యం రూ.49, పచ్చి బియ్యం రూ.48 ప్రకారం రైతుబజార్ కౌంటర్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. దీన్ని మరింత తగ్గిస్తూ కిలో కంది పప్పు రూ.150, స్టీమ్డ్ బియ్యం రూ.48, పచ్చి బియ్యం రూ.47 ప్రకారం ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వీటిని రైతు బజార్లతో పాటు జిల్లా వ్యాప్తంగా పెద్ద పెద్ద సంస్థాగత దుకాణాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. అందుకోసం జిల్లా వ్యాప్తంగా 51 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ వసంతబాబు, డీఎస్‌ఓ శోభారాణి, ఏడీఎం సత్యనారాయణచౌదరి పాల్గొన్నారు.

ఐఎస్‌ఓ 9001 సర్టిఫికెట్ వచ్చేలా సేవలు

ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ కార్యాలయాలకు ఐఎస్‌ఓ–9001–2015 సర్టిఫికెట్ వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ఉద్యానశాఖ, ఏపీఎంఐపీ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఉద్యానశాఖ ఇన్‌చార్జి డీడీ నరసింహారావు, డీఎస్‌ఓ శోభారాణి, ఏడీఎం సత్యనారాయణచౌదరి తదితరులతో సమావేశం నిర్వహించారు. మరింత నాణ్యమైన సేవలు అందించడంతో పాటు కార్యాలయాల ఆధునికీకరణతో ఐఎస్‌ఓ సర్టిఫికెట్ వచ్చేలా చూడాలని ఆదేశించారు.

ఆగనున్న 'అమూల్' పాల సేకరణ

- 11 నుంచి కార్యకలాపాలు బంద్



అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు అదనపు ఆదాయం కల్పించాలనే సమున్నత ఆశయంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రపంచంలోనే పేరొందిన 'అమూల్' సంస్థ సహకారంతో ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన 'పాలవెల్లువ' కార్యక్రమానికి కూటమి సర్కారు మంగళం పాడనుంది. కూటమి అధికారంలోకి రాగానే అమూల్‌కు సహకరించడానికి వీలులేదని ప్రభుత్వ డెయిరీ, పశుసంవర్ధకశాఖ, డీఆర్‌డీఏ, సహకారశాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు మిన్నకుండిపోయారు. దీంతో అమూల్ పాలసేకరణకు అవరోధంగా మారిందని చెబుతున్నారు. ఈ క్రమంలో చేసేది లేక అమూల్ సంస్థ కూడా పాలసేకరణను ఆపేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతానికి అనంతపురం జిల్లాలో ఈ నెల 11 నుంచి, తిరుపతి జిల్లాలో ఈ నెల 21 నుంచి పాలసేకరణ కార్యకలాపాలు నిలిపివేయనున్నట్లు పేర్కొనడం విశేషం. రైతులకు ఇబ్బంది లేకుండా చెల్లింపులు చేస్తామని, పాల సేకరణ నిలివేస్తున్నందుకు చింతిస్తున్నామని అమూల్ సంస్థ వెల్లడించింది.

'అనంత'లో విజయవంతంగా పాల సేకరణ

అమూల్ సంస్థ సహకారంతో జిల్లాలో చేపట్టిన 'పాల వెల్లువ' కార్యక్రమం అనతి కాలంలో విజయవంతమైంది. పాల ఉత్పత్తిదారులు, మహిళల నుంచి అనూహ్య స్పందన రావడంతో ప్రారంభించిన 15 రోజుల్లోనే 15 వేల లీటర్లకు చేరుకుంది. జిల్లాలో గత ఫిబ్రవరి 27న అమూల్ పాలవెల్లువ మొదలైంది. అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో 54 ఆర్‌బీకేల పరిధిలో 100 గ్రామాల నుంచి పాల సేకరణ మొదలు పెట్టారు. తొలిరోజు 3,200 లీటర్ల సేకరణతో శుభారంభం చేసిన కార్యక్రమం వారం తిరగకమునుపే 10 వేల లీటర్లు, 15 రోజుల్లోనే 15 వేల లీటర్లు దాటింది. గ్రామాల్లో మహిళల ద్వారా సొసైటీ ఏర్పాటు చేసి పాల సేకరణకు అవసరమైన అనలైజర్, అధునాతన బిల్లింగ్ మిషన్, ఇతరత్ర సామగ్రి అందజేశారు. తొమ్మిది ప్రాంతాలను పాల రూట్లుగా విభజించి అక్కడి నుంచి సేకరించిన పాలను కొర్రపాడు, రాచానపల్లిలో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ కూలింగ్ (బీఎంసీ) సెంటర్లకు తరలిస్తున్నారు. పాల నాణ్యతను బట్టి ధరలు ఇస్తుండటంతో ప్రైవేట్ డెయిరీల కన్నా లీటర్‌పై రూ.5 నుంచి రూ.10, ఇంకా అంతకన్నా అధికంగానే లభించడంతో గిట్టుబాటు అవుతున్నట్లు గతంలో అధికారులు ప్రకటించారు.

చిన్నారిపై కరస్పాండెంట్ అత్యాచారం





లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌ను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో చిన్నారి కుటుంబ సభ్యుల ఆందోళన

- మనవరాలి వయసున్న బాలికపై అఘాయిత్యం
- పిన్నికి ఫోన్‌లో తెలిపిన విద్యార్థిని
- అనంతపురం లిటిల్‌ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులుపై పోక్సో కేసు

అనంతపురం: నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న చిన్నారిపై కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ అత్యాచారానికి పాల్పడ్డాడు. సమాజంలో ఇన్నాళ్లూ పెద్ద మనిషిగా చలామణి అయిన 73 ఏళ్ల ఇతను మనవరాలి వయసు ఉన్న అభం శుభం తెలియని చిన్నారికి మాయమాటలు చెప్పి అకృత్యానికి ఒడిగట్టాడు. ఈ అమానుష ఘటనకు సంబంధించి బాధితురాలి కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాధిత చిన్నారి తల్లిదండ్రులు ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన వారు. బతుకుదెరువు కోసం దుబాయిలో ఉంటున్నారు. దీంతో పిన్ని సంరక్షణలో చిన్నారి ఉంటోంది. రెండు నెలల క్రితం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నాల్గో తరగతి చేర్పించి, హాస్టల్‌లో ఉంచారు. కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ గత శని, ఆదివారం రెండు దఫాలు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు చిన్నారి తన పిన్నికి ఫోన్‌లో తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫోన్ సంభాషణను పోలీసులకు అప్పగించారు. 'నగ్నంగా మీద పడుకోవాలని సార్ (ఆంజనేయులు గౌడ్) అంటుంటాడు. క్లాస్‌కు వెళ్లాలి.. సార్ కొడతారని చెప్పినా వినకుండా నన్ను అలా చేశారు. ఒకసారి డబ్బులు కూడా ఇచ్చాడు. అవి పెట్టెలో పెట్టి తాళం వేయడం మరచిపోయాను. దీంతో డబ్బులు ఎవరో తీసుకున్నార'ని అమాయకంగా వివరించింది. ఈ మాటలు విన్న పిన్ని, బాబాయ్ బోరున విలపిస్తూ శుక్రవారం ఉదయమే పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న కరస్పాండెంట్‌ను నిలదీశారు. ఇంతలోనే విద్యార్థి సంఘాల నాయకులకు విషయం తెలియడంతో వారు కూడా వచ్చి కరస్పాండెంట్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతన్ని టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఆంజనేయులు గౌడ్ నుంచి కీలక విషయాలను రాబట్టారు. అత్యాచారం జరిగినట్లు స్పష్టమైందని, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో చిన్నారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నిందితుణ్ని కఠినంగా శిక్షించాలి

చిన్నారి ఫోన్‌లో విషయం చెప్పడంతో పాఠశాల వద్దకు వచ్చాం. పాప ఏడుస్తూనే ఉంది. ఏమి జరిగింది చెప్పమ్మా అంటే.. జరిగినది మొత్తం వివరించింది. వెంటనే మా అన్న, మా చెల్లి వాళ్లకు ఫోన్ చేసి చెప్పాను. మా అన్నవాళ్లు అందరూ వచ్చారు. తెలుగు టీచర్ చెప్పింది అంట .. ఇక్కడ జరిగింది మీ వాళ్లకు చెబితే టీసీ ఇచ్చి పంపిస్తామని బెదిరించారట. జరిగిన దాని గురించి చెప్పొద్దు.. డబ్బులు ఇస్తామని చెప్పారు. డబ్బులు కూడా పాపకు ఇచ్చారు. అఘాయిత్యానికి పాల్పడిన పాఠశాల కరస్పాండెంట్‌ను కఠినంగా శిక్షించాలి.

– చిన్నారి పిన్ని

టీడీపీ నాయకుల అండ

కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌కు మద్దతుగా టీడీపీకి చెందిన కొందరు నాయకులు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టారు. అభం శుభం తెలియని విద్యార్థినిపై అఘాయిత్యం జరిగితే ఖండించాల్సింది పోయి.. కీచక కరస్పాండెంట్‌కు అనుకూలంగా పోస్టింగ్‌లు పెట్టడం గమనార్హం. వారి తీరును సామాన్య ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

తప్పకుంటారా.. తప్పించమంటారా!

- అధికార టీడీపీ నేతల హుకుం
- రేషన్ డీలర్లపై 'విజిలెన్స్' అస్త్రం
- రాజీనామా చేయాలని ఒత్తిళ్లు




కళ్యాణదుర్గం: రేషన్ దుకాణాల్లో పాగా వేసేందుకు అధికార టీడీపీ నాయకులు పావులు కదుపుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అనుకూల డీలర్లను తొలగించి ఆ స్థానాల్లో టీడీపీ మద్దతుదారులకు ఇప్పించేలా స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులకు ఆదేశాలిచ్చారు. అయితే కొందరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు డీలర్‌షిప్‌కు రాజీనామాలు చేయకపోవడంతో వారిపైకి 'విజిలెన్స్' అధికారులను ఉసిగొల్పుతున్నారు. విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించి ఏదో ఒక సాకుతో వారిని డీలర్‌షిప్ నుంచి తప్పించేలా కుట్ర పన్నినట్లు తెలుస్తోంది.

ఒత్తిళ్లు మచ్చుకు కొన్ని...

కళ్యాణదుర్గం మండలం చాపిరి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన వైస్ ఎంపీపీ లక్ష్మీ కాంతమ్మ 33వ నంబర్ రేషన్ దుకాణం నిర్వహిస్తోంది. గత నెల 26వ తేదీన ఆర్‌ఓ రాసినట్లు బియ్యం స్టాకు వస్తుందని గోదాము నుంచి లక్ష్మీ కాంతమ్మకు ఫోన్ చేశారు. అయితే అప్పటికే పలుమార్లు సీఎస్‌డీటీ సుబ్రమణ్యం లక్ష్మీకాంతమ్మతో రాజీనామా చేయాలని చెప్పారు. ఆమెతో ఎలాగైనా రాజీనామా చేయించి వెంటనే గ్రామంలో ఎంపిక చేసిన టీడీపీ నేతకు రేషన్ సరుకులు దింపేలా నాయకులు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆమె ససేమిరా అనడంతో అనంతపురం నుంచి విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపారు. శుక్రవారం విజిలెన్స్ సీఐ, ఎస్‌ఐ, డీటీలు డీలర్ లక్ష్మీకాంతమ్మ వద్దకు వెళ్లారు. పలురకాలుగా ఒత్తిళ్లు పెంచారు. వాస్తవానికి ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాల్సి ఉన్నా ఇప్పటికీ డీలర్‌కు సరుకులు దించలేదు. సరుకులు లేకుండానే విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడం ఇక్కడ కొసమెరుపు.

- కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లిలో 35వ నంబర్ రేషన్ దుకాణం నిర్వహిస్తున్న అనంతమ్మ వైఎస్సార్‌సీపీ మద్దతురాలు. ఎలాగైనా రాజీనామా చేయించాలని విజిలెన్స్ అధికారులు శుక్రవారం రేషన్ దుకాణం తనిఖీకి వెళ్లారు. గత నెలకు సంబంధించి 400 గ్రాముల బియ్యం బఫర్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే సమయంలో గత నెలకు సంబంధించి గోదాము నుంచి 5.50 క్వింటాళ్ల జొన్నలు వచ్చినట్లు/ అందులో బఫర్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే విజిలెన్స్ అధికారులతో సమాచారం అందుకుని సీఎస్‌డీటీ సుబ్రమణ్యం వెంటనే ఈ–పాస్ మిషన్‌లో జొన్నలు బఫర్ లేకుండా సాంకేతికంగా జీరో స్టాకు ఉన్నట్లు చూపించడం కొసమెరుపు. ఇలా చూపితే గోదాము నుంచి సదరు డీలర్‌కు స్టాకు చేరినట్లు నిర్ధారించే అవకాశం ఉంది. దీనిని సాకుగా చూపి డీలర్‌ను ఇబ్బంది పెట్టేలా సీఎస్‌డీటీ వ్యవహరించారని బాధిత డీలర్ వాపోయారు. అనంతరం రాత్రి 7.30 గంటల సమయంలో సదరు డీలర్ విజిలెన్స్ అధికారులతో వారించగా ఎట్టకేలకు బఫర్ జీరో చూపించి, తాళాలు వారికే అప్పగించి వెళ్లిపోయారు.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులుగా ఉన్న పలువురి రేషన్ దుకాణాలపై ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మర తనిఖీలు చేశారు. సదరు రేషన్ దుకాణాలకు వెంటనే రాజీనామాలు చేయాలని డీలర్లపై ఒత్తిళ్లు తెచ్చారు. పలు రకాలుగా ప్రశ్నలు సంధిస్తూ రాజీనామా చేసేలా విజిలెన్స్ సీఐ, ఎస్‌ఐ, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్‌లు ఒత్తిళ్లు తెచ్చారు. కాగా నియోజకవర్గంలో మొత్తం 246 రేషన్ దుకాణాలు ఉండగా గత ప్రభుత్వంలో ఉన్న కొందరు డీలర్లు కూటమి ప్రభుత్వం రాగానే స్వచ్ఛందంగా వైదొలిగారు. మరికొందరిచేత టీడీపీ నేతలు అధికారులను పంపి బలవంతంగా రాజీనామాలు చేయించారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద నీరు



విద్యుద్దీపాల వెలుగులో కాంతులీనుతున్న తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 1,90,653 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో నమోదైంది. 33 గేట్లలో 28 గేట్లను నాలుగు అడుగులు, మిగతా 5 గేట్లను ఒక్కటిన్నర అడుగు మేర పైకి ఎత్తి నీటిని నదికి విడుదల చేశారు. నదికి, కాలువలకు వదిలే నీటితో కలిపి అవుట్ ఫ్లో 1,82,160 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1,633 అడుగులతో 105.788 టీఎంసీలు ఉండగా.. శుక్రవారం సాయంత్రం నాటికి 1631.29 అడుగులతో 99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,139 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేయాలి : డీఏఓ


పి.యాలేరు వద్ద ఆముదం పంటను పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాల ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ఆత్మకూరు మండలం పి.యాలేరు, ఆత్మకూరు వద్ద ఖరీఫ్ కింద సాగు చేసిన వర్షాధార పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కంది పంటల స్థితిగతులపై రైతులతో ఆరా తీశారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వర్తిస్తాయని అన్నారు. అంతేకాక ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల పంట ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుచరిత, ఏఈఓ సుజిత, వీఏఏ భాగ్యలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

గుంతకల్లులో చైన్‌స్నాచింగ్

గుంతకల్లు టౌన్: స్థానిక ప్రశాంతి నగర్‌లో దుండగులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... ప్రశాంతి నగర్‌లో నివాసముంటున్న విశ్రాంత ఏఎస్‌ఐ త్యాగరాజు భార్య ఎం.నీలావతి శుక్రవారం ఉదయం చెత్తను తీసుకెళ్లి సమీపంలోని చెత్త కుండీలో పడేసి తిరిగి ఇంటికి వెళుతుండగా ద్విచక్ర వాహనంపై అనుసరించిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని 3 తులాల బరువున్న బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీసి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ

గుంతకల్లులోని విద్యానగర్-1 క్రాస్‌లో కిరాణా షాపు షట్టర్ తాళాలు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు రూ.2 వేల విలువ చేసే సిగరెట్లు, చిల్లర డబ్బు అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు అబ్దుల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే రైల్వే ఇనిస్టిట్యూట్ ఎదురుగా ఉన్న మహబూబ్ దౌలా కిరాణా దుకాణంలో కూడా దొంగలు చోరీకి యత్నించారు.

మహిమాన్విత హనుమద్ క్షేత్రాలు

- భక్తుల పాలిట కొంగుబంగారమైన నేమకల్లు, మురడి, కసాపురం ఆలయాలు
- శ్రావణ మాసంలో విశేష పూజలు


మురడి ఆంజనేయస్వామి


నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయం


మురడి ఆంజనేయస్వామి దేవాలయం


కసాపురం ఆంజనేయస్వామి దేవాలయం

బొమ్మనహాళ్: జిల్లాలోని నేమకల్లు, మురడి, కసాపురంలోని ఆలయాలు మహిమాన్విత హనుమద్ క్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న ఈ ఆలయాలను శ్రావణ మాసంలో ఒకే రోజు దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాస ఉత్సవాలకు హనుమద్ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

భక్తజన వరదాయకుడిగా...

భక్తజన వరదాయకుడిగా నేమకల్లు, మురిడి, కసాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామికి ఖ్యాతి ఉంది. 15వ శతాబ్దంలో వ్యాస మహర్షి ఒకే రోజున ఆయా ఆలయాల్లో ఆంజనేయస్వామి మూలవిరాట్‌లను ప్రతిష్ఠించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. శ్రావణ మాసంలో మంగళ, శనివారాల్లో ఈ మూడు ఆలయాలను దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తులు నమ్మకం. అందుకే ఈ మూడు ఆలయాలను సందర్శించుకునేందుకు శ్రావణ మాసంలో భక్తులు పోటెత్తుతుంటారు. ఈ క్రమంలో ఈ నెల 6న శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఉత్సవాలు, రథోత్సవాల్లో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా బారికేడ్లు, వసతి గృహాలను సిద్ధం చేశారు. ఈ నెల 6, 13, 20, 27వ తేదీల్లో వచ్చే మంగళవారాలు, 10, 17, 24, 31వ తేదీల్లో వచ్చే శనివారాల్లో విశేష పూజలు, ఆర్జిత సేవలు ఉంటాయని అర్చకులు తెలిపారు. అలాగే దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి



నెల రోజుల పాటు అంగరంగ వైభవంగా శ్రావణ మాస ఉత్సవాలను నిర్వహించేందకు నేమకల్లు, మురిడి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. వీఐపీ, సర్వదర్శనంతో పాటు అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భోజన వసతి, ప్రసాదం, అన్నదానం ఉంటుంది. – నరసింహారెడ్డి, ఈఓ

విద్యాశాఖ అధికారులపై కలెక్టర్ సీరియస్

- కొత్త సంప్రదాయానికి తెర తీయడంపై అసహనం
- రీప్యాట్రేషన్ చేసిన విధానంపై వివరణ కోరిన విద్యాశాఖ కమిషనర్
- కలకలం రేపిన 'సాక్షి' వరుస కథనాలు



అనంతపురం ఎడ్యుకేషన్: అస్మదీయుల కోసం విద్యాశాఖలో ఓ అధికారి తీసుకున్న అడ్డగోలు నిర్ణయం వివాదస్పదమైంది. ఈ అంశంపై కలెక్టర్ వినోద్‌కుమార్ తీవ్ర అసహనంతో ఉన్నట్లు సమాచారం. చిన్న లొసుగును ఆధారంగా చేసుకుని సమగ్ర శిక్షలో ప్రస్తుతం పని చేస్తున్న అందరినీ నిబంధనలకు విరుద్ధంగా ఒకేమారు తప్పించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు పన్నాగం పన్నారు. ఇందులో భాగంగా పక్కా వ్యూహంతో కలెక్టర్‌ను సైతం బురిడీ కొట్టించారు. రిలీవ్ ఉత్తర్వులు ఇవ్వకుండానే కలెక్టర్ పేరుతో ఆ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చేశారు. ఏఎంఓ, ఐఈడీ కో-ఆర్డినేటర్, అసిస్టెంట్ సీఎంఓ తప్ప మిగిలిన సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్లను రెండు రోజుల క్రితమే రిలీవ్ చేశారు. దీనికితోడు ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లనూ రిలీవ్ చేసేందుకు కలెక్టర్‌కు ఫైలు పెట్టి కొత్త సంప్రదాయానికి తెర తీశారు. సదరు అధికారి నిర్వాకంపై 'సాక్షి'లో రెండు రోజులుగా 'అస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం', 'సమగ్ర శిక్షలో కలకలం' వరుస కథనాలు వెలువడ్డాయి.

విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు బేఖాతరు

విద్యా సంవత్సరం మధ్యలో ఎవరినీ రిలీవ్ చేయొద్దని స్వయంగా విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేయడం విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉద్యోగులు, టీచర్లు అంటున్నారు. ఈ క్రమంలో అక్రమాలపై కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టి సారించారు. డీఈఓ పరిధిలో చేయాల్సిన సీనియర్ అసిస్టెంట్ల బదిలీలను తనతో చేయించేందుకు ఫైలు పెట్టడం, ఆ ఫైలంతా తప్పుల తడకగా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్ తీవ్ర అసహనానికి గురయ్యారు. ఇదే అంశంపై విద్యాశాఖ రాష్ట్ర అధికారులు సైతం వివరణ కోరారు. సెక్టోరియల్ అధికారులను రీప్యాట్రేషన్ చేసిన విధానంపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, సమగ్రలో రిలీవైన టీచర్లు డీఈఓ కార్యాలంలో రిపోర్ట్ చేసుకున్నారు. వారందరి పేర్లూ అటెండెన్స్‌లో ఎక్కించారు.

బాబ్బాబూ ఎవరైనా సమగ్రకు వస్తారా?

ఓ సీనియర్ అసిస్టెంట్ ధర్మవరం డీవైఈఓ కార్యాలయానికి వెళ్లేందుకు చేసిన ప్లాన్ బెడిసికొట్టేలా ఉంది. స్వయంగా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర అధికారులు దృష్టి సారించడంతో విద్యాశాఖ అధికారులు స్వీయరక్షణలో పడ్డారు. అధికారికి 'లబ్ధి' జరిగేలా చేసిన సదరు ఉద్యోగిని అక్కడే నియమిస్తే ఇప్పటికే వెల్లువెత్తిన ఆరోపణలకు బలం చేకూరే అవకాశం ఉంది. దీంతో ఏమి చేయాలనే దానిపై అధికారులు మల్లాగుల్లాలు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఒక పోస్టు ఖాళీ ఉంటే ఇద్దరిని రిలీవ్ చేశారు. ఒకరికి ధర్మవరం డీవైఈఓ కార్యాలయానికి కేటాయించినా... మరొకరు గాలిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సమస్య ఉత్పన్నం కాకుండా ఉమ్మడి జిల్లాలోని డీఈఓ కార్యాలయాలు, స్కూళ్లలో పని చేస్తున్న వారిలో ఎవరైనా ఒకరు సమగ్రశిక్ష కార్యాలయానికి రావాలని విద్యాశాఖ కార్యాలయ ఉద్యోగులు విన్నవించుకుంటున్నారు. అది ఎంతమాత్రం ఫలిస్తుందో ఒకట్రెండు రోజుల్లో తేలనుంది.

ఎలుగుబంటి హల్‌చల్


రోడ్డు మధ్యలో నిలబడిన ఎలుగుబంటి

కంబదూరు: మండలంలోని మంద – కుర్లపల్లి రహదారి మధ్యలో శుక్రవారం ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. సమీపంలోని కొండల్లో నుంచి వచ్చిన ఎలుగుబంటి రోడ్డుకు మధ్యలో నిలబడిపోయింది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, రైతులు భయందోళనకు గురయ్యారు. అక్కడి నుంచి ఎంతసేపటికీ ఎలుగుబంటి పక్కకు కదలక పోవడంతో చివరకు వాహనదారులు హారన్ల మోతతో బెంబేలెత్తించడంతో సమీపంలోని పొలాల్లోకి వెళ్లిపోయింది. ఇటీవల ఎలుగుబంట్లు తరచూ జనవాసాల్లోకి ప్రవేశిస్తున్నాయని, అటవీ శాఖాధికారులు స్పందించి తక్షణమే ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టాలని పలువురు కోరారు.

జిల్లాకే గర్వకారణం బళ్లారి రాఘవ


బళ్లారి రాఘవ పురస్కారాలు అందుకున్న సీనియర్ కళాకారులు

అనంతపురం కల్చరల్: తన అద్వితీయమైన నటనతో ప్రజానీకాన్ని ఆకట్టుకున్న బళ్లారి రాఘవ అనంత జిల్లా వాసి కావడం ఎంతో గర్వంగా ఉందని వక్తలు కొనియాడారు. బళ్లారి రాఘవ 144వ జయంతి సందర్భంగా అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో శుక్రవారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకట సుబ్బయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య సుధాకరబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌నారాయణ, రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ, సీనియర్ నటులు సంగాల నారాయణస్వామి, సోమిరెడ్డి, రామగోవిందు తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి బళ్లారి రాఘవ ఆదర్శప్రాయ జీవితాన్ని వివరించారు. అనంతరం బళ్లారి రాఘవ రాష్ట్ర, జిల్లా స్థాయి పురస్కారాలను సీనియర్ రచయితలు మార్తాటి ఈశ్వరీగోపాలరావు, కులశేఖర్, సంజీవరెడ్డి, దయానంద్‌కు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యనిర్వాహక సభ్యులు ఆదినారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కుళ్లాయప్ప, మల్లికార్జున, అస్లామ్, లోకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొదలు కానున్న ఖరీఫ్ ఈ-క్రాప్

- సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలని కమిషనరేట్ ఆదేశం


వేరుశనగ పొలంలో గతేడాది ఈ-క్రాప్ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్-2024కు సంబంధించి ఈ క్రాప్ (పంటల నమోదు) ప్రక్రియ మొదలుకానుంది. గత ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసి అర్హత కలిగిన రైతులకు వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చిన ఈ-క్రాప్ (పంట నమోదు) ప్రక్రియ కొనసాగిస్తూ చంద్రబాబు సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయశాఖ ఒకట్రెండు రోజుల్లో రంగంలోకి దిగనుంది. ఈ-క్రాప్ యాప్ అందుబాటులోకి వచ్చినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి. దీనికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఏడీఏ, ఏఓలకు కూడా కాన్ఫరెన్స్ ద్వారా పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. శనివారం కూడా మాస్టర్ ట్రైనర్ల ద్వారా రైతుసేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ప్రతినిధులకు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ఆ తర్వాత ఆర్‌ఎస్‌కేల వారీగా ప్రణాళిక ప్రకారం ఈ-క్రాప్ పక్రియ కొనసాగిస్తామన్నారు. ప్రస్తుతం ఈ- పంట నమోదు అప్లికేషన్‌లో సర్వే నంబర్ల వారీగా జియో కో ఆర్డినేటర్లతో ఫొటో తీయనున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా ఆర్‌ఎస్‌కేల వారీగా సర్వే నంబర్లు డౌన్‌లోడ్ చేసుకుని మ్యాపింగ్ చేస్తామన్నారు. రైతులందరూ తప్పనిసరిగా సాగు చేసిన ప్రతి పంటనూ ఈ-క్రాప్ చేసుకునేలా క్షేత్రస్థాయి అధికారులకు సహకరించాలని జేడీఏ కార్యాలయం విజ్ఞప్తి చేసింది. ఖరీఫ్‌లో సాగు చేసిన అన్ని రకాల వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలతో పాటు మల్బరీ విస్తీర్ణం కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సెప్టెంబర్ 15లోపు ఈ-క్రాప్ ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 19 నుంచి 24 వరకు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిమిత్తం ఆర్‌ఎస్‌కేల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామసభల్లో వచ్చిన అభ్యంతరాల పరిష్కారం కోసం సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 30న ఈ-క్రాప్ తుది ముసాయిదాను ఆర్‌ఎస్‌కేల్లో ప్రదర్శించడంతో ఖరీఫ్‌కు సంబంధించి ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. ఆ తర్వాత నవంబర్‌లో రబీ ఈ-క్రాప్ మొదలవుతుందని తెలిపారు.

తూమకుంటలో దారుణం

- ఏడేళ్ల బాలికను హత్య చేసి పెన్నానదిలో పాతి పెట్టిన పెదనాన్న
- నిందితుడు గతంలో రెండు హత్య కేసుల్లో ముద్దాయి


బాలిక మృతదేహం


పెన్నా నదిలో బాలిక మృతదేహం పూడ్చిన చోటును పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసులు, సిబ్బంది


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వి.రత్న (చిత్రంలో) అదనపు ఎస్పీ విష్ణు

హిందూపురం అర్బన్: అభం శుభం తెలియని ఏడేళ్ల బాలికను వరుసకు పెదనాన్న అయిన వ్యక్తి దారుణంగా హతమార్చాడు. సమీపంలోని పెన్నా నది ఇసుక మేటల్లో మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ఈ దారుణ ఘటన శుక్రవారం హిందూపురం మండలం తూమకుంట ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వి.రత్న శుక్రవారం రాత్రి అడిషనల్ ఎస్పీ విష్ణుతో కలసి హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. తూమకుంట ఎస్సీ కాలనీకి చెందిన మహిళను పరిగి మండలం బీచగానపల్లికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది. సదరు మహిళ మళ్లీ గర్భం దాల్చింది. అక్క, బావ గంగాధర్ తూమకుంట ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రసవం సమయంలో అక్క తోడుగా ఉంటుందనే ఉద్దేశంతో సదరు మహిళ.. అక్క ఇంటికి వచ్చింది. గర్భంతో ఉన్న తల్లిని చూసేందుకు మూడు రోజుల క్రితం ఏడేళ్ల కుమార్తె తూమకుంటకు వచ్చింది. వరుసకు పెదనాన్న అయిన గంగాధర్ శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో బాలికను పొలానికి తీసుకెళ్లాడు. తర్వాత ఒక్కడే ఇంటికి తిరిగి వచ్చాడు. అతన్ని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో బాలిక తల్లి అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే కాలనీకి చేరుకున్న సీఐ వై. శ్రీనివాసులు, సిబ్బంది బాలిక పెదనాన్న గంగాధర్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. తనే బాలికను చంపి పెన్నానది ఇసుక మేటల్లో పూడ్చినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతన్ని వెంట తీసుకొని సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం నిందితున్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. అతను బాలికను అత్యాచారం చేసినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలితే పోక్సో కేసు కూడా నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు.

గతంలోనూ రెండు హత్యలు

బాలికను హతమార్చిన గంగాధర్ గతంలోనూ రెండు హత్యలు చేశాడు. 2012లో పరిగి మండలం శాసన కోటకు చెందిన నాగరత్న అనే యువతి తూమకుంటలో జాతరకు రాగా అప్పట్లో గంగాధర్ హత్య చేశాడు. అలాగే 2020 సంవత్సరంలో తూమకుంటకే చెందిన బోయ హనుమక్క (70)అనే వృద్ధురాలిని హతమార్చాడు. ఈ కేసులో శిక్ష అనుభవిస్తూ ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు వీరేష్

గుత్తి రూరల్/పామిడి/ పెద్దవడుగూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామానికి చెందిన కురుబ వీరేష్ (30) సెంట్రింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పామిడిలోని భార్య రేణుకమ్మ బంధువులతో కలసి భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం వ్యక్తిగత పనిపై పెద్దతుంబలం వెళ్లిన ఆయన శుక్రవారం ఉదయం పామిడికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. గుత్తి సమీపంలోని టోల్‌ప్లాజా వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం ఇవ్వడంతో హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే వీరేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విలేకరిపై టీడీపీ మహిళా నేత దాడి

- బాధితుడి పైనే కేసు నమోదు


బాధిత విలేకరి ప్రతాప్

తాడిపత్రి టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తాడిపత్రిలో టీడీపీ నేతలు చెలరేగిపోతున్నారు. ఈ క్రమంలోనే వారి దౌర్జన్యాలు, అక్రమాలను ఎండగడుతున్న పత్రికా విలేకరులపై దాడులకు తెగబడ్డారు. ఒక్కరోజు ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు.. స్థానిక చింత వేంకటరమణ స్వామి ఆలయం సమీపంలో తాడిపత్రికి చెందిన ఓ పత్రిక విలేకరి ప్రతాప్‌పై టీడీపీ మహిళా నేత కమలమ్మ దాడి చేసింది. అందరూ చూస్తుండగానే గురువారం ఉదయం తన అనుచరులు గండికోట కార్తీక్, నాగరాజు మరో 12 మందితో కలసి ప్రతాప్‌ను చుట్టుముట్టింది. అసభ్య పదజాలంతో దూషిస్తూ కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. అడ్డుకోబోయిన స్థానికులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తూ విరుచుకుపడ్డారు. తమ నాయకుడు జేసీ ప్రభాకరరెడ్డి గురించి తప్పుగా మాట్లాడుతున్నాడని, తమకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నాడంటూ దాడి చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తే స్పందన కరువైంది. కాగా, కమ్మలమ్మ ఫిర్యాదు మేరకు బాధితుడిపైనే పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకులకు కొమ్ముకాసిన పోలీసుల వైఖరి చర్చనీయాంశమైంది.

టీటీ కోచ్‌పై విచారణ పూర్తి

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిక టీటీ (టేబుల్ టెన్నిస్) కోచ్ టి.ధనుంజయరెడ్డిపై అందిన ఫిర్యాదులపై విచారణ పూర్తయింది. టీటీ శిక్షణకు వస్తున్న ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆయనపై ఫిర్యాదులున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. టీటీ శిక్షణకు హాజరవుతున్న క్రీడాకారిణులు, తల్లిదండ్రులు హాజరై జరిగిన అంశాలను వివరించారు. దీనిపై నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా విచారణాధికారులు వెల్లడించారు.

పొట్ట కొట్టకండి సార్!


రేషన్ కోసం ఆందోళన చేస్తున్న కార్డుదారులు

ఉరవకొండ: కూలీనాలీ చేసుకుని బతికే తమకు బియ్యం ఇవ్వకుండా పొట్ట కొట్టకండి సార్ అంటూ ఉరవకొండ పట్టణంలోని మూగబసవన్నకట్ట ఏరియా కార్డుదారులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. చౌకడిపో నంబర్-12 పరిధిలో ఉన్న తమకు రెండు నెలల నుంచి రేషన్ అందడం లేదని నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఇంటి వద్దకే వాహనంలో బియ్యం , ఇతర వస్తువులు తీసుకొచ్చి ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం రేషన్‌షాపుల వద్దకు వెళుతున్నా బియ్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు కార్డుదారులు వినతి పత్రం అందించారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి

యాడికి: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... జూటూరు-వేములపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో పట్టాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఓ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు గుత్తి జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (26)గా గుర్తించారు. గుత్తి నుంచి తాడిపత్రికి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణమైన ఆయన డోర్ వద్ద నిలబడి ప్రయాణిస్తూ మార్గమధ్యంలో అదుపు తప్పి కింద పడి మృతి చెంది ఉంటాడని ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వద్దు



సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: ఫీల్డ్ విసిట్ పేరుతో విధులను నిర్లక్ష్యం చేయవద్దని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సిబ్బందికి సూచించారు. శుక్రవారం నగరంలోని 55వ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ప్రజల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. రికార్డుల్లో ఫీల్డ్ విసిట్ అని నమోదు చేసి, సంబంధిత విధుల్లో లేకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం గుల్జార్‌పేట, ఆదిమూర్తి నగర్, సుభాష్ రోడ్డు, 1, 2, 3, 4, 5 రోడ్లలో పర్యటించారు.

7న ముత్యాలమ్మ ఆలయంలో వేలం

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 7వ తేదీన వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గదులు, ఐస్‌క్రీమ్, టోల్‌గేట్, కొబ్బరి చిప్పలు, అమ్మవారి ఫోటోల విక్రయానికి వేలం జరుగుతుందన్నారు. ప్రతి వేలంపాటకు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ముందుగా డిపాజిట్ సొమ్ము, ఆధార్‌కార్డు అందజేయాలని సూచించారు. వివరాల కోసం 9866383092 నంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ వేలం దేవదాయశాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు జరుగుతుందని పేర్కొన్నారు. వేలం హక్కు కాలపరిమితి సంవత్సరం ఉంటుందని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం అని మాజీ మంత్రి సాకే శైలజా నాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చెల్లుబాటుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఈ తీర్పును వెలువరించడం జరిగిందన్నారు. విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఎస్సీ వర్గీకరణ అవసరమన్నారు. వర్గీకరణ దారా మాదిగలకు, మాదిగ ఉపకులాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం వర్గీకరణ తామే చేశామని ప్రచారం చేయడం మాని ఉద్యోగాల భర్తీలో చట్టం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాపు వాసు, రామ్ చరణ్ యాదవ్, ఆంజనేయులు, ఇంద్రావతి, ఓబులేసు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై అత్యాచారాలు దుర్మార్గం



ఎంఎస్ నగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న స్త్రీ విముక్తి సంఘటన నాయకులు, మహిళలు

అనంతపురం అర్బన్: చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు అత్యంత దుర్మార్గమని స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి అన్నారు. అత్యాచారాలకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఎస్‌నగర్ (మండ్ల సుబ్బారెడ్డి నగర్)లో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లీశ్వరి మాట్లాడుతూ.. పెట్టుబడిదారి కార్పొరేట్ దోపిడీ శక్తులు తమ వ్యాపార ప్రయోజనాల కోసం మహిళను వ్యాపార సరుకుగా మార్చేశాయన్నారు. సినిమాలు, టీవీ సీరియళ్లు, జబర్దస్తు వంటి వివిధ కార్యక్రమాలు స్త్రీలను అసభ్యంగా చూపిస్తూ పురుషాధిక్య భావజాలాన్ని స్థిరీకరిస్తూ బలోపేతం చేస్తున్నాయన్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకురాళ్లు రాధమ్మ, భూదేవి, నవయుగ సమాఖ్య నాయకురాలు మల్లీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

చెన్నేకొత్తపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 ప్రసూన్ కుమార్ నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెల్దురి గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, ఎంతమంది హాజరయ్యారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ప్రభుత్వం సరఫరా చేసిన విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా? రోజు ఎలా ఉంటుంది? కోడిగుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతలో అభివృద్ధికి అడ్డంకులు

- టెండర్లు ముందుకు సాగకుండా 'తమ్ముళ్ల' మోకాలడ్డు
- రూ.13.80 కోట్లతో 87 అభివృద్ధి పనులకు టెండర్ల ఆహ్వానం



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అనంతపురం నగరంలో అభివృద్ధి పనులకు అధికార టీడీపీ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. నిర్దేశిత సమయంలో టెండర్ల అగ్రిమెంట్ జరగాల్సి ఉన్నా.. ముందుకుసాగడం లేదు. నగరంలోని వివిధ డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం, నగరపాలక సంస్థ సాధారణ నిధులు, ఎస్‌క్యాప్ నిధులు రూ.13.80 కోట్లతో 87 అభివృద్ధి పనులు చేపట్టేందుకు జూలై 12న నగరపాలక సంస్థ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఒక్కో టెండర్‌కు ఐదుగురికి పైగా కాంట్రాక్టర్లు కోట్ చేశారు. దీంతో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులే టెండర్ దక్కించుకోవాలనే ఉద్దేశంతో టెండర్ల ప్రక్రియను జాప్యం చేయాలని ఇంజినీర్లపై ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. దీంతో గత నెల 26, 29 తేదీల్లో టెక్నికల్ బిడ్‌ను అధికారులు ఓపెన్ చేశారు. టెక్నికల్ బిడ్ తర్వాత టెండర్ ఎవాల్యుయేషన్ ప్రక్రియ జరగాలి. కానీ ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఎవాల్యుయేషన్ చేసిన తర్వాత ప్రైస్ బిడ్ ఓపెన్ చేస్తారు. అందులో తక్కువ బిడ్ కోట్ చేసి, నగరపాలక సంస్థ కమిషనర్ అనుమతితో సంబంధిత కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్, తదితర ఉత్తర్వులను జారీ చేయాల్సి ఉంది. కానీ ఈ ప్రక్రియ తీవ్ర జాప్యం జరుగుతోంది. అధికార పార్టీకి చెందిన అనుయాయులే పనులు చేయాలన్న ఆలోచనతో అభివృద్ధికి మోకాలడ్డుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

20 డివిజన్లలో అభివృద్ధికి బ్రేక్

టెండర్ నిర్వహణ సకాలంలో సాగకపోవడంతో నగరంలోని 20 డివిజన్లలో అభివృద్ధికి బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. అభివృద్ధి పనులకు సంబంధించి ముద్దలాపురం ఫిల్ట్రేషన్ పాయింట్‌లో మోటార్లు, తదితర అభివృద్ధి పనులకు రూ.కోట్ల నిధులు కేటాయించారు. గతంలో మోటార్లు చెడిపోవడంతో నగర ప్రజలకు రోజుల తరబడి నీటి సమస్య వచ్చింది. పాలకవర్గం (వైఎస్సార్‌సీపీ) ముందుచూపుతో పీఏబీఆర్ డ్యాంలో మోటార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. శ్రీనగర్ కాలనీలోని నీరు -ప్రగతి వనం జంక్షన్‌లో రూ.2.2 కోట్లతో రోడ్డు విస్తరణ, అభివృద్ధి, 1, 3, 9,12, 13,15, 20, 21, 28,32, 37, 38, 40, 43,45, తదితర డివిజన్లలో రూ.13.80 కోట్ల అభివృద్ధి పనులు జరగాల్సి ఉంది. ఈ పనులు మొదలైతే నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పాలి.

5వ తేదీ నాటికి వర్క్ ఆర్డర్ ఇచ్చేలా చర్యలు

అభివృద్ధి పనులకు సంబంధించి నిర్దేశిత సమయంలోనే టెండర్ నిర్వహణ, ఎవాల్యుయేషన్, తదితర పనులు జరిగేలా చూస్తున్నాం. ఇందులో ఎవరి ప్రమేయమూ లేదు. ఈ నెల 5వ తేదీ నాటికి కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

– పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్‌డీ, కమిషనర్, నగరపాలక సంస్థ

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిత



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

అనంతపురం: క్రమశిక్షణ కలిగిన వారే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం శ్రీవిజయనగర న్యాయ కళాశాలలో మాదక ద్రవ్య నిరోధక చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ రాహిత్యంతో వ్యక్తి వికాసాన్ని కోల్పోయి నేరాలకు పాల్పడే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. మాదక ద్రవ్య వినియోగం కూడా అందులో ఒకటి అన్నారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌తో విద్యార్థి భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరి రామిరెడ్డి మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాలను విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర కళాశాల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. విజయ నగర లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.రాఘవేంద్ర చార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ పూజలు



అలంకరణలో నిముషాంబా దేవి

అనంతపురం కల్చరల్: ఆషాఢమాసం చివరి శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పాతూరు చెరువుకట్టపై వెలసిన నిముషాంబా దేవి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో అలంకారం చేశారు. భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో ఆషాఢమాస పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన అమ్మవారి నవధాన్యాలతో అలంకార సేవలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు అరవింద్, ఉపాధ్యక్షుడు దేవరాజ్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది. స్థానిక కొత్తూరు, పాతూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో, రాంనగర్ పెద్దమ్మ తల్లి ఆలయం తదితర చోట్ల ఆషాఢ పూజలు ఘనంగా జరిగాయి.

ఆదర్శప్రాయుడు పింగళి వెంకయ్య



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: తెలుగు వారి ఖ్యాతినికి ప్రపంచానికి చాటి చెప్పిన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య ఆదర్శప్రాయుడని మేయర్ వసీం అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో ఆయన చేసిన సేవలను మేయర్ కొనియాడారు. భారత ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన జాతీయ జెండా రూపకర్తగా పింగళి వెంకయ్య సేవలను స్మరించుకోవడమే కాకుండా భవిష్యత్ తరాలకు వారి సేవలను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భావితరాల భవిష్యత్తు దేశం, సమాజం కోసం ఎంతో మంది మహనీయులు చేసిన సేవలు, త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, కార్పొరేటర్లు బాలాంజనేయులు, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఏసీపీ మారుతీ హరిప్రసాద్, ఈఈ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



చిన్నారి కే.అర్జున్‌ను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: స్పార్క్ చెస్ అకాడమీ సెకెండ్ ఇంటర్నేషనల్-బీ విభాగంలో 1800 ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2024 పోటీలు విజయవాడలో జూలై 12 నుంచి 14 వరకు జరిగాయి. భారత్, కెన్యా, యూఎస్‌ఏ దేశాల నుంచి 616 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అండర్-6 విభాగంలో అనంతపురానికి చెందిన అర్జున్.కే రన్నరప్ సాధించి సత్తా చాటింది.

వ్యక్తిపై కొడవలితో దాడి



రవికుమార్‌కు చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం: టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కృపానంద నగర్‌కు చెందిన పల్లపాటి రవికుమార్ అనే వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు కొడవలితో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం రవికుమార్ అనంతపురం నుంచి ధర్మవరానికి బైక్‌లో బయలుదేరాడు. అరవింద నగర్ పార్కు సమీపంలోకి చేరుకోగానే ఇద్దరు వ్యక్తులు కొడవలితో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రవికుమార్‌ను హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



ఆత్మకూరు: పి.యాలేరులో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం



రాప్తాడు: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి

రాప్తాడు: తల్లి ముర్రుపాలే బిడ్డకు శ్రీరామ రక్ష. తల్లిపాలు అమృతంతో సమానం. తల్లిపాలే బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకా అని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తొలుత గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీడీపీఓ ధనలక్ష్మి మాట్లాడారు. బిడ్డ పుట్టిన మరుక్షణమే బిడ్డకు ముర్రు పాలు పట్టించడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. తల్లి పాలను మించిన తొలి పోషకాహారం ప్రపంచంలో ఏదీ లేదని తెలిపారు. ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తల్లి పాలను రెండేళ్ల పాటు అందించాలని సూచించారు. తల్లిపాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బాల్య వివాహాలతో అనర్థాలు తలెత్తుతాయన్నారు. వీటి నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. 18 సంవత్సరాల్లోపు బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉండడంతో వారికి వివాహాలు చేసినప్పుడు మృత్యు మరణాలు సంభవిస్తాయన్నారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలపై ప్రచురించిన పోస్టర్లను విడుదల చేశారు. పౌష్టికాహారం, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం, తల్లిపాల విశిష్టత, టీకాలు, 108, పిల్లల సంరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, చేపలు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవాన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ లీగల్ అడ్వైజర్ నర్మద, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శాంత కుమారి, ప్రథమ కో-ఆర్డినేటర్ లక్ష్మణ్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, ఏఎస్ఎం లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆత్మకూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు సీజ్ చేశారు. బెళుగుప్ప మండలం కాలువపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేశారు.

టీడీపీ నాయకులు ఒప్పుకుంటేనే బిల్లులు

- అధికార పార్టీ నేతల ఆదేశాలతో నసేమిరా అంటున్న పంచాయతీ కార్యదర్శి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రాచానపల్లి సర్పంచ్

రాప్తాడురూరల్: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీల్లో ప్రజా అవసరాల కోసం చేపట్టే చిన్న చిన్న పనులనూ అడ్డుకుంటున్నారు. తాము చెప్పే వరకూ ఏ ఒక్క బిల్లూ పెట్టకూడదంటూ పంచాయతీ అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిళ్లు చేస్తున్నారు. వారి ఒత్తిడితో కొందరు పంచాయతీ కార్యదర్శులు బిల్లులు పెట్టేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలో అత్యవసర పనులకు సంబంధించిన బిల్లులు పెట్టడం లేదు. వీధిలైట్లు, మురుగు కాలువల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్‌కు సంబంధించిన బిల్లులు పెట్టేందుకు పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ నసేమిరా అంటున్నారు. బిల్లులు పెట్టొద్దని స్థానికంగా ఉండే కొందరు టీడీపీ నాయకులు ఫోన్లు చేస్తున్నారని ఈ క్రమంలో పెండింగ్ పెట్టినట్లు కార్యదర్శి రఫీ చెబుతున్నారు. చివరకు తాగునీటి అవసరాల నిమిత్తం బోరు వేయించేందుకు కూడా పంచాయతీ కార్యదర్శి ఆసక్తి చూపడం లేదు. టీడీపీ నాయకులు ఒప్పుకుంటేనే బిల్లులు పెడతాం.. కొత్త బోరు వేయిస్తామని చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి వ్యవహారంపై నాలుగు రోజుల కిందట సర్పంచ్ బండా అంజియాదవ్ స్వయంగా కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అత్యవసర బిల్లులు పెట్టడం లేదంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే తాను అప్పులు చేసి పంచాయతీ పరిధిలో వివిధ పనులు చేపట్టానని అందుకు సంబంధించిన బిల్లులు కూడా పెట్టడం లేదని వాపోయారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తాను సర్పంచ్ అయినప్పటి నుంచి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ చిన్న సమస్య రాకుండా చూశానన్నారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో పలుబోర్లు వేయించి ఇబ్బందులు లేకుండా చూశానన్నారు. ఇప్పుడు ప్రజలు వచ్చి అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నానన్నారు. ప్రజా అవసరాల విషయంలో అధికారులు మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు.

సప్లిమెంటరీ పరీక్ష ఫీజు తగ్గించాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో నిర్వహించే మెగా సప్లిమెంటరీ పరీక్షలకు కరువు దృష్ట్యా జిల్లా విద్యార్థులకు ఫీజు తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్కేయూలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2015-2019 సంవత్సరం వరకు యూనివర్సిటీ పరిధిలో చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషకరమన్నారు. ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రస్తుతం కరువు జిల్లాలో వ్యవసాయం ఇతర ప్రాంతాల్లో పనులు, కొందరు పెళ్లి చేసుకుని ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరీక్ష ఫీజు తగ్గించి సప్లిమెంటరీ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ రజిత, ఉపాధ్యక్షులు వైటీసీ రమేష్, వంశీ, సిద్ధూ, గిరి సహాయ కార్యదర్శి సూర్య, వెంకీ, బీమేష్ పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: మహిళలు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత అన్నారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఎం.కల్పన కృష్ణయ్య రచించిన 'మెన్ ఎంటర్‌ప్రెనూర్‌షిప్' అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. మహిళలు గృహ బాధ్యతల పరిమితుల నుంచి విభిన్న రంగాల్లో కీలకమైన సహకారాన్ని అందించే దిశగా పారిశ్రామిక వేత్తలుగా మారాలని ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధికారిత, ఆర్థిక స్వేచ్ఛ, సవాళ్లు, విజయాలను అన్వేషించే అంశంపై ఈ పుస్తకం మార్గనిర్దేశం చేస్తుందన్నారు. ఉమెన్స్ స్టడీ సెంటర్‌లో మహిళలపై 49 ఆర్టికల్స్, 18 ఫీల్డ్ వర్క్ మైక్రో సర్వేలు చేసి ఈ అంశంపై మూడు పుస్తకాలను రచించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, మేథమేటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ శోభాలత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం చేస్తాం

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 30 సంవత్సరాల క్రితం ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో మందకృష్ణ మాదిగ నేతృతంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమైందన్నారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలు తో ఉద్యమాలు చేపట్టారని అందుకు ప్రతిఫలంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై సానుకూలంగా తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాల ఉద్యమ ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

కురుబల సమస్యలపై పోరాడతాం

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా కురుబలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బోరంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో అన్ని మండలాలకు కమిటీలు వేశామన్నారు. రాప్తాడు నాయోజకవర్గ కురుబ సంఘం అధ్యక్షుడిగా బిల్లే నరేంద్రను ఏకగీవంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అలాగే అనంతపురం రూరల్ అధ్యక్షుడిగా బండి ఈశ్వరయ్యను ఎంపిక చేశామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబలు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిటీ అధ్యక్షుడు నేమలివరం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నీటి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి తెలపడంతో పాటు రాష్ట్ర నీటి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈనెల 5వ తేదీన కలెక్టరేట్ ఎదుట ఆందోళన తలపెట్టామన్నారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో మల్లికార్జున విలేకరులతో మాట్లాడారు. కృష్ణా గోదావరి నదీ జలాల వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యూనల్ కేటయింపులపై భిన్నంగా బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మిగులు జలాలను కూడా లెక్కగట్టి నీటి కేటాయింపులు చేయడంపై గతంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిందని గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయం అమలు చేస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం పీడిత రాయలసీమ కడుపుకొట్టడమే అవుతుందన్నారు. వ్యవసాయాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళన విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నగేష్, చంద్ర పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: ఆంబర్ ప్రాజెక్ట్ కింద నిరుద్యోగ యువతకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం మేనేజర్ కొత్తూరు రాజశేఖర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్సియల్ (సీపీఓ), హోటల్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ అండ్‌బీ), జాబ్ రోల్స్‌తో పాటు ట్యాలీ, ఎంఎస్ ఆఫీసు కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. సమాచారానికి 93981 54460, 75696 59964లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి ఈ-క్రాప్ బుకింగ్

చెన్నేకొత్తపల్లి: 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ శనివారం నుంచి ప్రారంభిస్తామని మండల వ్యవసాయాధికారి ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను తప్పక నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, ఇటీవల తీసుకున్న 1బీ, పట్టాదారు పాస్ బుక్, సెల్‌ఫోన్ నంబర్ తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. ఈ-క్రాప్ బుకింగ్‌తో క్రాప్ ఇన్సూరెన్స్, పంట కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తాయని పేర్కొన్నారు.